ఉత్సవాలు సరే...రోడ్డు మాటేమిటి?

- దేవుని కడప బ్రహ్మోత్సవాలకు అసౌకర్యం
- అధ్వానంగా మారిన రహదారి


తారు లేచిపోయి.. అధ్వానంగా కనిపిస్తున్న రహదారి


దేవుని కడప ఆలయం

కడప కల్చరల్ : తిరుమలేశుని తొలి గడప దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా ప్రజలకు ఈ ఉత్సవాల గురించి పెద్ద స్థాయి సెంటిమెంట్ ఉంది. ఉత్సవాలు జరిగినన్ని రోజులు పెద్ద ఎత్తున జనం వస్తారు. ప్రధానంగా రథోత్సవం రోజున రోడ్లన్నీ కిక్కిరిసిపోతాయి. ఇప్పటికే ఈ ఉత్సవాల గురించి ప్రచారం ప్రారంభమైంది. కానీ కడప నగరం నుంచి దేవుని కడప గ్రామానికి వెళ్లేందుకు రోడ్డును గమనిస్తే అన్యాయం అనిపించకమానదు. ముఖ్యంగా మార్కెట్‌యార్డు నుంచి దేవుని కడప చెరువు వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. గత కమిషనర్ రోడ్ల విస్తరణలో భాగంగా మార్కెట్ యార్డు మొదట్లో భారీగా సర్కిల్ ఏర్పాటు చేశారు. మాసాపేట సెంటర్‌లో సర్కిల్ ఏర్పాటుచేసి దేవుని కడప నమూనా గోపురాన్ని ఏర్పాటుచేయడంతో భక్తులు ఎంతో సంతోషించారు. ఆ తర్వాత మార్కెట్‌యార్డు వద్ద కూడా సర్కిల్ ఏర్పాటు చేయడంతో పాటు దేవునికడప వరకు రోడ్డును విశాలం చేసి అందంగా తీర్చిదిద్దుతారని ఆశించారు. తీరా పనులు ప్రారంభం కాగానే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారింది. కొత్త అధికారులు వచ్చారు. ముందున్న సింగిల్ రోడ్డును విస్తరణలో భాగంగా ఇరువైపులా 95 శాతం తవ్వేయడంతో కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై సైకిల్ వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. ఈ ఐదారు నెలలుగా ప్రజలు అలాగే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వారం రోజుల్లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా వేలాదిగా ప్రజలు తరలివస్తారు. వాహనదారుల సంగతి అటుంచితే కనీసం నడిచి వెళ్లేందుకు కూడా రోడ్డు అనుకూలంగా లేదు. మాసాపేట నుంచి రోడ్డుకు ఇరువైపులా గుంతలు తేలి కంకర వెలికి రావడంతో భక్తులు ఈ మార్గంలో నడిచి వెళ్లేందుకు నరకయాతన పడాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు లాంటి చిన్న వాహనాల సంగతి కూడా అలాగే ఉంది. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తే బ్రహ్మోత్సవాల సమయానికి భక్తుల అవసరాలకు అనుగుణంగా రోడ్డు రూపుదిద్దుకునే అవకాశం ఉంది. ఇప్పటికే దేవుని కడప ఆలయం సమీపంలో గుంతలు తేలి ఉన్న రోడ్లను అధికారులు పూడ్చి వేసి చదును చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా ప్రధానమైన రోడ్డులోనూ గుంతలు లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

బైపాస్‌లో సర్కిల్

దేవుని కడప నుంచి పాత కడపకు ఉత్తరం వైపునగల బైపాస్‌రోడ్డు వద్ద కూడా సర్కిల్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బైపాస్ మెయిన్‌రోడ్డు నుంచి పాత కడపలోకి ప్రవేశించే మార్గంలో రోడ్డు మధ్యలో అక్కడ దేవుని కడప ఆలయం ఉందని తెలిపేలా నమూనాతో సర్కిల్ ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. అలాంటి సర్కిల్ ఉంటే బైపాస్‌లో వెళ్లే భక్తులు దేవునికడపలోని వచ్చి దర్శనం చేసుకునే అవకాశముందని, గ్రామం కూడా బాగుపడుతుందని వారు తెలియజేస్తున్నారు.

ఆక్రమణలతో ఇబ్బందులు

దేవుని కడప ఆలయ మాడవీధులు నానాటికి ఆక్రమణలకు గురై కుంచించుకు పోతున్నాయి. ప్రధాన ద్వారం ఎదుట ఒక్క వాహనం వెళితే రెండవ వాహనానికి ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు వేగంగా వస్తాయేమోనని నడిచే వెళ్లే భక్తులు భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. ప్రధానంగా ఆలయం ఎదుట దుకాణాలు రోజురోజుకు రోడ్డు పైకి వస్తున్నాయి. ఉత్సవాల సమయంలో వాటికి తోడు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది.

క్లుప్తంగా

బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరిఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. 8–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు శిక్షణకు అర్హులని, దూర ప్రాంతాల వారికి శిక్షణ కాలంలో స్థానికంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

డైరీతో ఎంతో ప్రయోజనం



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డైరీతో హెచ్‌ఎంలకు ఎంతో ప్రయోజనం ఉందని జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ అన్నారు. హెచ్‌ఎం సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు హెచ్‌ఎంలందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రావు, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అపర్ణ, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బద్వేలులో జాబ్‌మేళా


కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బద్వేలులోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, అల్ డిక్సన్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ, పేటీఎంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఎల్‌ఐసీలో బీమా సఖి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18–50 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆయా ఉద్యోగాన్ని బట్టి రూ.7–18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాలో విద్యార్హత, ఫొటోలతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గంగమ్మ ప్రతిష్ఠ


బుగ్గయేరు గంగమ్మ ఆలయం

కడప కల్చరల్: కడప నగరంలోని రవీంద్ర నగర్ లా కళాశాల వద్ద వెలసిన బుగ్గయేరు గంగమ్మ తల్లికి ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పునః ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక ఉత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 19న ఉదయం గణపతిపూజ, కలశారాధన, 20న పంచద్రవ్య స్థాపనం, అంకురార్పణ, జలాధివాసం, రుద్ర, చండీ, అంకురార్పణ హోమాలు, గ్రామోత్సవం ఉంటాయన్నారు. 21న ఉదయం 6 గంటలకు గణపతిపూజ, కలశారాధన, 8 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ హోమం, మహా పూర్ణాహుతి ఉంటాయన్నారు. పది గంటలకు మహాకుంభాభిషేకం, తిరు ఆరాధనఉంటాయన్నారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

బాలోత్సవం కరపత్రాల పంపిణీ


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ఫిబ్రవరి 1, 2వ తేదీలలో నిర్వహించనున్న కడప బాలోత్సవం–2ను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇలియాస్‌బాషా కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బాలోత్సవం కమిటీ సభ్యుడు కరీముల్లాతో కలిసి గురువారం ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం, మట్టితో తయారు చేసిన బొమ్మలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఖాజామైనుద్దీన్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

రేపు జమ్మలమడుగులో సదస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంంం తరలించడాన్ని నిరసిస్తూ శనివారం జమ్మలమడుగు పాత బస్టాండు ఆవరణలో ప్రజాభిప్రాయ సదస్సు, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీజీబీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ డి.మహమ్మద్ పిలుపునిచ్చారు. ఈ ప్రాంత ప్రయోజనాలతో ముడిపడిన సమస్యగా భావించి జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలు, ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు.

యువజన సమస్యలపై క్రియాశీలక ఉద్యమం



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: యువజన సమస్యలపై క్రియాశీలక ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన ఏఐవైఎఫ్ నగర సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక బెంగళూరు, చెన్నై హైదరాబాద్‌కు వలస వెళ్తున్నారన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో కావాల్సిన భూములున్నా, పారిశ్రామిక అభివృద్ధి జరగలేదన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు ఉద్యమించాలని, అక్కడ అభివృద్ధి జరిగితే కడప చాలా అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ కడప నగర నూతన కమిటీని 17మంది సభ్యులతో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రదీప్, కార్యదర్శిగా శివ నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా చైతన్య, నాగార్జున, వీరాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా సంజయ్, రాహుల్, ఫణీంద్ర, కోశాధికారిగా రాజేష్‌లను ఎన్నుకున్నామని తెలిపారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ


వాక్‌థన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించినపుడే ప్రమాదాలను నివారించ గలుగుతామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు విజయభాస్కర్, ప్రసాద్, ట్రాఫిక్ సీఐ జావిద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నగర శివారులోని ఊటుకూరు ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో గురువారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ రవాణా, పోలీస్ శాఖ అధికారులు వాక్ థన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ ధరించి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు తెలుసుకోవాలన్నారు. ప్రమాదాల్లో ఎక్కువగా యువత మృత్యువాతపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ లక్ష్మీ ప్రసన్న, ఎస్‌ఐలు భూమా అరుణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రతాప్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వైవీయూ విద్యార్థుల సంక్షేమ విభాగం, మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అన్నారు. న్యాయవాదులు ఎస్.పర్వీన్‌నాజ్, జి.ఉమ, సైకాలజిస్టు పీవీ.సునీత మాట్లాడుతూ వర్క్ ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపులు (నివారణ, నిషేధ, పరిహారం) చట్టం– 2013 పై అవగాహన కల్పించారు. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో ఇది అమలులో ఉందని, లైంగిక వేధింపుల చర్యలను నిరోధించడం, నిషేధించడం, పరిష్కరించడం ద్వారా మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించడమే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ అన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నగరంలోని పలు విద్యా సంస్థల వద్ద గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతోందన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల స్థితిగతులను అర్థం చేసుకోవడానికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. విమానాశ్రయాలు, సముద్ర పోర్టులు, తినుబండారాల నూనెలు, సిమెంట్, బొగ్గు, రైల్వే లైన్లు, రక్షణ రంగాలను ప్రైవేటీకరించి కార్పొరేట్ సంస్థలకు తక్కువ ధరకు విక్రయించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సైబర్ భద్రతపై మహిళలకు అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహమ్మద్ సిఖిందర్ హుస్సేన్

కడప ఎడ్యుకేషన్: సైబర్ భద్రతపై కడప నగర శివారులోని గవర్నమెంట్ మైనార్టీ ఐటీఐ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ సిఖిందర్ హుస్సేన్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో వ్యక్తిగత, సంస్థాగత సమచార భద్రత అత్యంత కీలకమన్నారు. సైబర్ నేరాలు, హ్యాకింగ్, ఫిషింగ్, మాల్‌వేర్ వంటి సైబర్ ముప్పుల గురించి వివరించారు. మీ మీ గూగుల్ అకౌంట్లకు పాస్‌వర్డులను మెరుగ్గా రూపొందించుకోవాలన్నారు. గవర్నమెంట్ మైనార్టీ ఐటీఐ ప్రిన్సిపల్ జ్ఞానకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ ప్రపంచంలో బాధ్యతగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ


డీఈఓను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పకడ్బందీగా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ చేపట్టి.. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్టీయూ నాయకులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, రషీద్ ఖాన్, ఇలియాస్‌బాషా, సంగమేశ్వర రెడ్డి, రామ్మోహన్, చెన్నకేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్‌ను గురువారం ఎస్టీయూ నాయకులు కలిసి సత్కరించారు. తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117 జీవో రద్దు అనంతరం క్లస్టర్ పాఠశాలల ఏర్పాటు, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఎంపిక ద్వారా పునర్నిర్మాణ ప్రక్రియలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన విధానంలో ఈ ప్రక్రియ ముగిసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. 3, 4 ,5వ తరగతులను వెనక్కి తెస్తూ ప్రతి గ్రామ పంచాయతీలోనో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పాఠశాల మూతపడకుండా చూడాలని, ఉన్నత పాఠశాలల్లో మాథ్స్, ఇంగ్లీష్ టీచర్ల మిగులు ఏర్పడే పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో పాఠ్యపుస్తకాలు ఉండేలా చూడాలని, సిలబస్ యొక్క ప్రామాణికత పడిపోతే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉందన్నారు. డీఈవో స్పందిస్తూ త్వరలో సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి కూలంకషంగా చర్చిస్తామన్నారు.

యువతకు సుభాస్ చంద్రబోస్ ఆదర్శం



సుభాష్ చంద్రబోస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ మునేష్‌మీనా



రక్తదానం చేస్తున్న ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్: నేటి యువత సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ మునేష్‌మీనా అన్నారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీబీఎస్‌సీ, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వెంకటసాయి కృష్ణారెడ్డి, సుమంత్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా రామచంద్రన్, షేక్ నబీలాఫలక్, బీరం శ్రీధర్‌రెడ్డి, సౌమ్య తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు సర్టిఫికెట్లు, ట్రోఫీతో పాటు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప ఎడ్యుకేషన్: ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ, అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. అనంతరం నగరంలోని జడ్పీ వద్దగల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం, మానసిక ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శిబిరం ఏర్పాటుచేసి రక్తదానం చేశారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్ మాట్లాడుతూ బ్రిటీష్ వారిని తరిమి కొట్టడానికి రష్యా, జర్మనీ, జపాన్ దేశాల మద్దతు కోరి బ్రిటీష్ సైన్యంపై తిరుగుబాటు చేసిన ఘనత సుభాష్ చంద్రబోస్‌దే అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ముందుండి ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బమ్మ, హిమబిందు, అరుణ కుమారి, సగిలి రాజేంద్రప్రసాద్, వసంత్, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడిఫై విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయం ఎదుట విద్యార్థుల ఆందోళన

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ అధికారులను, విద్యార్థులను మోసం చేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఎడిఫై విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరు పట్టణాల్లోని ఎడిఫై స్కూల్స్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా యాజమాన్యం 2025–26కు అడ్మిషన్లు ప్రారంభించిందన్నారు. డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు.

కడప గడపలో క్రికెట్ సందడి


క్రికెట్ నెట్స్‌లో సాధన చేస్తున్న ఆంధ్రా జట్టు


స్టేడియంలో సాధన చేస్తున్న పంజాబ్ జట్టు

- 25 నుంచి కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ
- పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ జట్లతో తలపడనున్న ఆంధ్రా జట్టు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు ఆంధ్రా, పంజాబ్ జట్లు తలపడనున్నాయి. అదే విధంగా ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రా జట్లు తలపడనున్నాయి. కాగా ఆంధ్రా, పంజాబ్ జట్లు ఇప్పటికే కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానానికి చేరుకుని ప్రాక్టీస్ ప్రారంభించాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సాధన చేస్తూ విజయం కోసం శ్రమిస్తున్నారు. కాగా ప్రతిష్ఠాత్మకమైన కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్ష, కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ.రెడ్డిప్రసాద్ తెలిపారు.

ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉత్తమ జీవనశైలితో మానసిక ఆరోగ్యం కాంతులీనుతుందని వైవీయూ ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య కృష్ణారెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్, వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వీసీ గురువారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, వ్యక్తిగత భేదాలు, ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. రిజిస్ట్రార్ పి.పద్మ మాట్లాడుతూ ఆలోచించే సమయం తీరిక లేక.. యువకులలో ఒత్తిడి, నిరుత్సాహం ఆవరిస్తోందని తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొ.ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోషల్ మీడియా, ఇంటర్నెట్‌లో ఎక్కువ సమయం గడపడంతో మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని తెలిపారు. మానసిక ఆరోగ్యం బాగుండాలంటే సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక అంతర్లీనం, కలుపుగోలుతనం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు డా.ఝాన్సీరాణి, డా.లలిత, డా.లక్ష్మీనారాయణ పలు విషయాలను వివరించారు. ఎన్.ఎస్.ఎస్. సమన్వయకర్త డా.ఎన్.వెంకటరామిరెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ఏపీటీఎఫ్ నేతలు


డీఈఓను అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: డీఈఓగా బాధ్యతలు చేపట్టిన షేక్ షంషుద్దీన్‌ను గురువారం ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు కలిశారు. సమాంతర మాధ్యమాన్ని ప్రతి పాఠశాలలో ఏర్పాటుచేయాలని, ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిని బట్టి ప్రస్తుత పరిస్థితులను సవరించాలని కోరారు. ఈశ్వరచంద్ర, అలీఖాన్, సాయిప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సైన్సుపై అభిరుచి కలిగేలా చూడాలి


ఆర్‌జేడీని సన్మానిస్తున్న ఎబినైజర్

కడప ఎడ్యుకేషన్: చిన్నారులకు సైన్సు పట్ల అభిరుచి కలిగేలా చూడాలని ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. జిల్లా సైన్సు అధికారి వేపరాల ఎబినైజర్ ఆర్జీడీని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల సాధనకు సమష్టిగా కృషి చేద్దాం


డైరీ, క్యాలెండర్‌ను అందజేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, రాబోయే పదో తరగతి పరీక్ష ఫలితాలలో మెరుగైన ఫలితాలు సాధించడానికి సమష్టిగా కృషి చేద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను గురువారం యూటీఎఫ్ నాయకులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు పాఠశాలల సందర్శన సమయంలో చిన్న లోపాలను స్నేహపూరిత వాతావరణంలో సరిదిద్దుకునే విధంగా చూడాలన్నారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పాటుపడేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేదార్‌నాథ్, రామకేశవ, గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, మస్తాన్‌బాషా, అబ్దుల్ గని, పి.చంద్రశేఖర్, శివశంకర్, ప్రకాష్, వై.సురేష్ కుమార్, అస్రాఫ్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గోడలకు పగుళ్లు

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో పనులు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. ఆర్‌ఎం కార్యాలయ భవనాలకు చాలాకాలంగా మరమ్మతులు చేపట్టకపోడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ పనులకు గానూ దాదాపు రూ.13 లక్షలు మంజూరుచేసింది. ఆ నిధులను ఉపయోగించి పటిష్టంగా పనులు చేపట్టాల్సి ఉంది. అయితే పైపైన పూత పూసి లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ నిర్లక్ష్యం చేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. నాణ్యతగా పనులు చేపట్టాలని కోరుతున్నారు.


పగుళ్లిచ్చినా.. గోడలకు సున్నం కొట్టేశారిలా..